సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 14 । జనవరి । 2025



సోమశిలలో 70.543 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారానికి 70.543 టీఎంసీలు ఉన్నాయి. 2041 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 2650, ఉత్తరకాలువకు 600, కండలేరుకు 200, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.80,880
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,340
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,560
సవర (8 గ్రాములు)	రూ.60,480

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
28.1 /24.0

జిల్లాలో మంగళవారం అక్కడక్కడ ఆకాశం మేఘావృతంగా ఉండి ఒకటి.. రెండు చోట్ల చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సోమవారం గాలిలో తేమ 86 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

రెడ్‌క్రాస్‌లో రాజకీయం

- ఐదుగురికి నోటీసులిచ్చిన కలెక్టర్

నెల్లూరు(అర్బన్): సేవకు ప్రతి రూపంగా ఎంతో పేరు తెచ్చుకున్న నెల్లూరు రెడ్‌క్రాస్ రాజకీయానికి వేదికగా మారింది. నేరుగా రాజకీయ పార్టీలతో సంబంధం ఉన్న నేపథ్యంలో రాష్ట్ర గవర్నర్ ఆదేశాల మేరకు ఐదుగురు రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులకు కలెక్టర్ ఆనంద్ రెండు రోజుల క్రితం నోటీసులు జారీ చేసినట్లు తాజాగా తెలిసింది. రాజకీయ పార్టీలో కీలకంగా ఉన్న నేపథ్యంలో వివరణ ఇవ్వడంతోపాటు తమ పదవుల నుంచి వైదొలగాలని కలెక్టర్ నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో పాటు మలిరెడ్డి కోటారెడ్డి, గంధం ప్రసన్నాంజనేయులు, దామిశెట్టి సుధీర్‌నాయుడు, ఎంవీ సుబ్బారెడ్డిలకు నోటీసులు జారీ చేశారు. అయితే ఇప్పటికే విమర్శలకు తావివ్వకూడదనే ఉద్దేశంతో ఎమ్మెల్సీగా ఉన్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తన రెడ్‌క్రాస్ చైర్మన్ పదవికి రాజీనామా చేసి కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. వీరంతా ఈ నెల 15వ తేదీలోపు కలెక్టర్‌కు వివరణ ఇవ్వాల్సి ఉంది. ఇదే అదనుగా భావించిన అధికార టీడీపీ ఎమ్మెల్యేలు సైతం రెడ్‌క్రాస్‌లో రాజకీయాలు నడుపుతున్నారు. రెడ్‌క్రాస్‌లో కనీసం సభ్యత్వం లేకపోయినప్పటికీ తమ పార్టీకి చెందని ఒకరిని కమిటీ కన్వీనర్ చేయాలంటూ ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రతిపాదనలు చేసి కలెక్టర్‌తో మాట్లాడినట్లు సమాచారం. ఇందుకు నిబంధనలు అంగీకరించవనే విషయం సైతం ఆ ఎమ్మెల్యేలకు తెలిసినా.. అధికార పార్టీగా ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. రెడ్‌క్రాస్‌లో ఈ ఐదుగురే కాకుండా, ఇంకా కొంతమంది రాజకీయ పార్టీలకు చెందిన నేతలు కీలక పదవుల్లో ఉన్నారు. మిగతా వారిని వదిలేసి కేవలం ఈ ఐదుగురి విషయంలో కలెక్టర్ తీసుకుంటున్న నిర్ణయం వివాదాస్పదంగా మారుతోంది. ఇదిలా ఉండగా ఫిబ్రవరి నెలాఖరుకు రెడ్‌క్రాస్ కమిటీని రద్దు చేసే యోచనలో కలెక్టర్ ఉన్నారని, కొత్త కమిటీ ఎన్నికకు జెండా ఊపనున్నారని ప్రచారం జరుగుతోంది. ఏమి జరుగుతుందో వేచి చూడాలి.

తెలుగు కీర్తి పురస్కారానికి నరేంద్రబాబు ఎంపిక



నెల్లూరు (టౌన్): శ్రీకళావేదిక వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పొయిట్రీ అకాడమీ, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ ఆధ్వర్యంలో తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారానికి కేఎన్నార్ పాఠశాల ఉపాధ్యాయుడు గుండాల నరేంద్రబాబు ఎంపికయ్యారు. ఈ నెల 21న విజయవాడలోని కౌతా పూర్ణానంద విలాస్‌వేదిక నిర్వహించే సాహిత్య సభలో పురస్కారాన్ని అందుకోనున్నారు.

సర్పంచ్ దాతృత్వం

- సొంత నిధులతో 58 మందికి ఇళ్ల స్థలాలు
- మౌలిక వసతుల కల్పన, గ్రామాభివృద్ధి



ఇంటి పట్టాలను అందజేస్తున్న సర్పంచ్ సిద్ధంరెడ్డి రమామోహన్‌రెడ్డి దంపతులు

మర్రిపాడు: ప్రతి పేదవాడి జీవితకాల స్వప్నం సొంతిల్లు. ఆ కలను సాకారం చేసేందుకు ఆ నిరుపేదలకు సామాన్య కుటుంబానికి చెందిన మండలంలోని చిలకపాడు పంచాయతీ సర్పంచ్ రమా మోహన్‌రెడ్డి బాసటగా నిలిచారు. గ్రామంలో 623 కుటుంబాలు ఉండగా, సుమారు 2,500 మందికి పైగా జనాభా ఉన్న ఆ గ్రామానికి సిద్ధంరెడ్డి రమా మోహన్‌రెడ్డి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఆనాటి నుంచి గ్రామాభివృద్ధిపై దృష్టి సారించారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ భాగస్వామ్యానికి తోడు సొంత నిధులు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నారు.

రెండెకరాల్లో 58 మందికి ఇళ్ల స్థలాలు

గ్రామంలో ఇల్లు లేని నిరుపేదల కోసం గ్రామ సర్పంచ్ సిద్ధంరెడ్డి రమ తన భర్త వైఎస్సార్‌సీపీ నేత మోహన్‌రెడ్డి సహకారంతో రెండెకరాల స్థలాన్ని కొనుగోలు చేశారు. సిద్ధంరెడ్డి నారసింహారెడ్డి-నాగమ్మ కాలనీ పేరుతో 58 మందికి కోసం రెండు సెంట్లు చొప్పున ఇంటి స్థలాలను సిద్ధం చేయించి వారికి సోమవారం భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టాలను అందజేశారు. తమ సొంత ఖర్చులతోనే రిజిస్టర్ చేయించి డాక్యుమెంట్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఆ ఇళ్ల స్థలాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కోసం మరో రూ.30 లక్షల వరకు ఖర్చు చేయనున్నారు. ఇళ్లు లేని నిరుపేదల కోసం తమ సొంత నిధులతో స్థలాలు కొని పట్టాలు అందజేయడంపై ఆ దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌పీ మండల అధ్యక్షుడు చెన్ను వెంకటేశ్వరరెడ్డి, జిల్లా యాక్టివిస్ట్ సెక్రటరీ చిట్టెం శ్రీనివాసులు, మాజీ కన్వీనర్లు గంగవరపు శ్రీనివాసులునాయుడు, బొర్రా సుబ్బిరెడ్డి, చంద్రా నారాయణస్వామి, భీమవరం మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.



భోగి సంబరాలు

నెల్లూరు నగరంలోని శివాజీ సెంటర్లో భోగి మంటలతో సంప్రదాయతను చాటుతూ స్థానికుల సంబరాలు (సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు)



ఎడ్ల పరుగు పోటీల కోలాహలం

సంక్రాంతిని పురస్కరించుకుని కోవూరులో రాష్ట్ర స్థాయిలో రైతుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో కోలాహలంగా ఎడ్ల పందేలు నిర్వహించారు (కోవూరు)



రంగవల్లుల శోభ

సంక్రాంతి నేపథ్యంలో ఇస్కపల్లిలో మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. (అల్లూరు)



బరి తెగింపు

జిల్లాలో పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న రామాయపట్నం బీచ్‌లోని రిసార్ట్స్ వేదికగా స్థానిక ఎమ్మెల్యే సహకారంతో అధికార పార్టీ నేతలు 'బరి' తెగించి కోడి పందేలు, డైమండ్ డబ్బా నిర్వహించారు. అడ్డుకోవాల్సిన పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారు. సంక్రాంతి నేపథ్యంలో కోడి పందేలను కట్టడి చేయాలని సర్వోన్నత న్యాయం ఇచ్చిన ఆదేశాలను ప్రభుత్వ పెద్దలే ధిక్కరించి ఎక్కడికక్కడ యథేచ్ఛగా కోడి పందేలు నిర్వహించేందుకు పార్టీ నేతలను ప్రోత్సహించారు. అటు వైపు కన్నెత్తి చూడొద్దని పోలీసులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. అక్కడే అనధికారికంగా మద్యం విక్రయాలు చేస్తున్నారు.



పందెం వేయడానికి అనుమతిస్తూ వేసిన ట్యాగ్

యథేచ్ఛగా కోడి పందేలు, డైమండ్ డబ్బా, కోత ముక్కలాట

- మంత్రి లోకేశ్ ముఖ్య అనుచరుడి జూదం
- బరిలో దిగాలంటే.. రూ.500 కడితే పసుపు ట్యాగ్
- వీక్షకులకు టికెట్లు, వాహనాలకు పార్కింగ్ ఫీజు వసూలు
- అక్కడే మద్యం విక్రయాలు
- ఎమ్మెల్యే సహకారంతోనే నిర్వహణ
- చేష్టలుడిగి చూసిన పోలీసులు



రామాయపట్నంలో జరుగుతున్న కోడిపందేలు



పందేల బరుల వద్దే యథేచ్ఛగా మద్యం విక్రయాలు

ఉలవపాడు: అధికార పార్టీ బరి తెగించింది. మండలంలోని పర్యాటక కేంద్రం రామాయపట్నాన్ని జూదానికి అడ్డాగా మార్చేశారు. సంక్రాంతి మూడు రోజుల పాటు విచ్చలవిడిగా కోళ్లకు కత్తులు కట్టి పందేలు నిర్వహిస్తున్నారు. డైమండ్ డబ్బా, కోత ముక్కలాటలు ఆడిస్తున్నారు. అనధికారికంగా మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. జూదాన్ని అరికట్టాల్సిన పోలీసులు చేష్టలుడి చూస్తున్నారు. మంత్రి లోకేశ్‌కు ముఖ్య అనుచరుడిగా ఉన్న తెలుగు యువత నేత మండలంలోని రామాయపట్నంలో రిసార్ట్స్ నిర్వహిస్తున్నాడు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో ఆయన రిసార్ట్స్ వేదికగా కోడి పందెలు నిర్వహిస్తున్నట్లు వారం రోజులు ముందు నుంచే నెల్లూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో విస్తృత ప్రచారం నిర్వహించారు. కోడి పందేలు నిర్వహించొద్దని, వీటిపై కఠినంగా వ్యవహరించాలని హైకోర్టు ఆదేశాలిచ్చింది. సర్వోన్నత న్యాయం స్థానం ఆదేశాలను సైతం అధికార పార్టీ నేతలు ధిక్కరించి కోడి పందేలు నిర్వహిస్తామని బహిరంగంగా ప్రచారం నిర్వహించినా పోలీస్ యంత్రాంగం తమకేమి పట్టనట్లు వ్యవహరించింది. భోగి పండగ నుంచి కోడిపందేలు, పేకాట, డైమండ్ డబ్బా నిర్వహిస్తున్నా.. కనీసం అటు వైపు కన్నెత్తి చూడని పరిస్థితి.

కోడి పందేలకు మూడు 'బరులు'

రామాయపట్నం రిసార్ట్స్ వద్ద కోడి పందేలు నిర్వహించేందుకు మూడు బరులు ఏర్పాటు చేశారు. నెల్లూరు, ప్రకాశం నలుమూలల నుంచి పందేలు వేయడానికి పెద్ద సంఖ్యలో పందేల రాయుళ్లు ఇక్కడికి వచ్చారు. పందెం బరిలోకి వెళ్లాలంటే రూ.500 ఫీజు చెల్లించాలి. ఇందు కోసం వారి చేతికి పసుపు రంగు ట్యాగ్ వేస్తారు. ఇలాంటి ట్యాగ్ ధరించిన వారే కోడి పందేలు నిర్వహించాలి. ఇక పందేలు వీక్షించే వారికి సైతం టికెట్లు పెట్టారు. వాహనాలకు పార్కింగ్ ఫీజు కూడా వసూలు చేస్తున్నారు. కారుకు రూ.50, బైక్‌కు అయితే రూ.20 చెల్లిస్తేనే లోపలికి అనుమతిస్తారు. ఇక కోడిపందేలు జరుగుతున్న చోటకే మద్యం తీసుకుని వచ్చి బహిరంగంగా అమ్ముతున్నారు. ఇంత జరుగుతున్నా పట్టించుకునే వారేలేరు.

మూడు రోజులు.. రూ.3 కోట్లు

సంక్రాంతి మూడు రోజులు నిర్వహించే కోడి పందేలు, పేకాట, డైమండ్ డబ్బా ద్వారా రూ.3 కోట్ల వసూలు చేసుకోవాలని నిర్వాహకులు లక్ష్యం పెట్టుకున్నట్లు సమాచారం. సోమవారం భోగి రోజు సుమారు రూ.75 లక్షల వరకు వసూలు అయినట్లు తెలుస్తోంది.

ప్రజల్లో చులకనైన పోలీసు శాఖ

కోడి పందేలు వేయాలంటే పోలీసులను చూసి భయపడేవారు. అయితే ఈ సారి కోడి పందేలను దగ్గరుండి నిర్వహిస్తుండడంతో ప్రజల్లో పోలీసు శాఖ చులకన అయిపోయింది. అధికార పార్టీ పెద్దల నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగానే ఎస్పీ దగ్గర నుంచి ఎస్సై వరకు అందరూ ముఖం చాటేసినట్లు స్థానికంగా బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. పోలీసులు వస్తే ఇబ్బందులుంటాయని కొందరు అంటుంటే.. వాళ్లు మన జోలికి రారులే. మనల్ని పట్టుకుంటే వారే బదిలీ అయిపోతారంటూ.. నిర్వాహకులు బహిరంగంగానే చెబుతుంటే.. వింటున్న పందేల రాయుళ్లు, ప్రేక్షకులు ఆశ్చర్యపోతున్నారు.

గతంలో ఎన్నడూ లేదు..

గతంలో ఇంత దారుణంగా బహిరంగంగా జూదం ఎప్పుడూ నిర్వహించలేదు. గతంలో ఎమ్మెల్యేలుగా ఉన్న మానుగుంట మహీధరరెడ్డి, శివరాం, పోతుల రామారావు కూడా ఇలాంటి సంస్కృతిని అంగీకరించలేదు. తొలిసారిగా ఇంత విచ్చలవిడిగా జూదం జరుగుతోంది. ఈ జూదం జరిగే ప్రాంతం ఆనుకుని మెరైన్ సీఐ, ఎస్సైలు ఉంటారు. కానీ వారు రూమ్ దాటి బయట చూసే పరిస్థితి లేదు. ఎస్పీ దగ్గర నుంచి ఎస్సైల వరకు ఎవరూ ఈ పందేలు నిలుపుదల చేయలేని పరిస్థితి ఉంది.

ఎమ్మెల్యే సహకారంతోనే..

స్థానిక ఎమ్మెల్యే సహకారంతోనే కోడి పందేలు జరుగుతున్నట్లు సమాచారం. తొలుత పోలీసు శాఖ ఈ జూదం నిర్వహించడానికి ఒప్పుకోవడానికి ఇష్టపడకపోగా ఎమ్మెల్యేనే స్వయంగా రంగంలోకి దిగి పట్టుకోవద్దు.. అన్ని చోట్ల జరుగుతున్నాయి. ఈ మూడు రోజులు వదిలేయండంటూ పోలీసులను ఆదేశించినట్లు సమాచారం. మంత్రి లోకేశ్‌తో ఫోన్ చేయించామని, పోలీసులు అటు వైపు రారు.. మీరు ధైర్యంగా వచ్చి పందేలు వేయొచ్చని నిర్వాహకులు చెబుతున్నారు. మూడు రోజుల పాటు ఇక్కడ పందేలు, డైమండ్ డబ్బా, పేకాట జరుగుతుంది.



భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం



ఆత్మకూరులోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద పెంచిన విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేస్తున్న రైతు సంఘం కార్యవర్గ సభ్యులు



కోవూరులోని పల్లిపాళెంలో భోగి మంటల్లో కరెంట్ బిల్లులు వేస్తున్న స్థానికులు

ఆత్మకూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికల ప్రచారంలో చెప్పిన మాటలకు భిన్నంగా విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలను తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతు సంఘం నాయకులు మండి పడ్డారు. ఈ నెలలో వచ్చిన పెరిగిన విద్యుత్ బిల్లులను సోమవారం వేకువజామున భోగి మంటల్లో వేసి నిరసన వ్యక్తం చేశారు. బైపాస్‌రోడ్డులోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లులు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నిరసిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ కృష్ణప్రసాద్, ఎ శ్రీనివాసులురెడ్డి, ఎం బ్రహ్మారెడ్డి, తిరుపాలు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలపై నిరసన..

కోవూరు: కూటమి ప్రభుత్వం పెంచిన ట్రూఅప్ చార్జీలను నిరసిస్తూ ప్రజలతో పాటు సీపీఎం నేతలు జిల్లాలో పలు ప్రాంతాల్లో కరెంట్ బిల్లులను సోమవారం వేకువ జామున భోగి మంటల్లో వేసి దహనం చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధికారానికి రాక ముందు బాదుడే బాదుడని ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలని డిమాండ్ చేసిన కూటమి నాయకులు అధికారం వచ్చీరాగానే ప్రతి నెల కరెంట్ బిల్లుల్లో ట్రూఅప్ చార్జీలు కలిపి ప్రజలపై భారాలు మోపిందని సీపీఎం నాయకులు మండిపడ్డారు. కోవూరు పట్టణంలోని పల్లిపాళెం ప్రాంతంలో మరో కుటుంబం కరెంట్ బిల్లులను భోగిలో వేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గండవరపు శేషయ్య, బుజ్జియ్య, పెద్దబ్బాయ్య, మోహన్, సురేష్ రమేష్, మణి, తిరుపతి, లీలమ్మ సంపూర్ణమ్మ చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



పోతిరెడ్డిపాళెంలో బిల్లులు దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



ఎడ్లను పరిగెత్తిస్తూ..





ద్వితీయ బహుమతి ఇస్తూ..



తృతీయ బహుమతి



ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు

- విజేతగా నిలిచిన అల్లూరు జత ఎడ్లు
- తిలకించేందుకు భారీగా తరలివచ్చిన ప్రజలు

కోవూరు: భోగి సందర్భంగా కోవూరులో రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు సోమవారం జరిగాయి. రైతు సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కొత్తూరు డొంకలో జరిగిన పోటీల్లో కృష్ణా, ప్రకాశం, బాపట్ల, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి సుమారు 40 జతల ఎడ్లను తీసుకొచ్చారు. పోటీలను వీక్షించేందుకు జనం పెద్ద ఎత్తున విచ్చేశారు. ఓ వైపు వర్షం కారణంగా పోటీలు ఆలస్యమైనా లెక్క చేయలేదు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కమిటీ చర్యలు చేపట్టింది. పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. పోటీలను తిలకించేందుకు వ్యాపారవేత్తలు, రాజకీయ ప్రముఖులు తరలివచ్చారు. కార్యక్రమంలో వేమారెడ్డి భరత్‌రెడ్డి, వేమారెడ్డి సునీల్‌రెడ్డి, రామిరెడ్డి మల్లికార్జునరెడ్డి, నీలపరెడ్డి అనిల్‌కుమార్‌రెడ్డి, కమిటీకి చెందిన పాబ్బా మల్లికార్జునరెడ్డి, దేవిరెడ్డి సురేష్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు శివుని నరసింహులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

5.17 నిమిషాల్లో..

అల్లూరు ప్రాంతానికి చెందిన ఎస్ఎస్ బ్రదర్స్ ఎడ్ల జత 3 కిలోమీటర్ల దూరాన్ని 5.17 నిమిషాల్లో చేరుకుని మొదటి స్థానంలో నిలిచింది. నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టేపాళేనికి చెందిన వరసిద్ధి వినాయక ఎడ్ల జత 5.25 నిమిషాలతో రెండో స్థానంలో, ఇందుకూరుపేట మండలం చాముండేశ్వరి సీ ఫుడ్స్‌కు చెందిన ఎడ్ల జత 5.29 నిమిషాలతో మూడో స్థానంలో నిలిచాయి.

బహుమతుల అందజేత

ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.40 వేల బహుమతి, ట్రోఫీని అనపల్లి అశోక్‌కుమార్‌రెడ్డి తన భార్య సులోచనమ్మ జ్ఞాపకార్థంగా అందజేశారు. ద్వితీయ బహుమతి రూ.25 వేలను దండి వీరరాఘవయ్య జ్ఞాపకార్థం ఆయన భార్య సుబ్బమ్మ, కుటుంబసభ్యులు అందించారు. ఈ జట్టుకు పెద్ది ప్రభావతి జ్ఞాపకార్థంగా ఆమె కుమారుడు పెద్ది మారుతి నాగార్జున రోల్డ్ కప్ అందజేశారు. తృతీయ బహుమతిగా రూ.20 వేలను గాదిరాజు ప్రభాకర్‌రావు, కుమారుడు సురేష్‌బాబు జ్ఞాపకార్థంగా ఆయన తమ్ముడు గాదిరాజు జీవన్‌కృష్ణ ఇచ్చారు. ట్రోఫీని పాబ్బా రెడ్డి రామిరెడ్డి జ్ఞాపకార్థంగా ఆయన కుమారులు పంపిణీ చేశారు.



ప్రథమ బహుమతి అందజేస్తూ..

విదేశీ మద్యం విక్రయిస్తుండగా..

- నెల్లూరులో ఒకరి అరెస్ట్
- 25 లీటర్ల స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): ఇళ్ల మధ్యలో గుట్టుచప్పుడు కాకుండా విదేశీ మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. 25 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నారు. అధికారుల కథనం మేరకు.. నెల్లూరు మధ్యపతివారి వీధిలో మునిస్వామి నాగరాజు నివాసం ఉంటున్నాడు. అతను చెన్నైకి చెందిన ఎస్.ప్రభు, మాణిక్యం ద్వారా విదేశీ మద్యంను నెల్లూరు నగరం స్టోన్‌హౌస్‌పేటలోని ఓ ట్రాన్స్‌పోర్టు కార్యాలయం ద్వారా దిగుమతి చేసుకుంటున్నాడు. బాటిళ్లను ఇంట్లో ఉంచి విక్రయాలు సాగిస్తూ సొమ్ము చేసుకోసాగాడు. కొంతకాలంగా జరుగుతున్న ఈ అక్రమ దందాపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్ శర్మకు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు స్టేట్ టాస్క్‌ఫోర్స్ అధికారి మధు పర్యవేక్షణలో సిబ్బంది సోమవారం తెల్లవారుజామున నాగరాజు ఇంట్లో సోదాలు చేశారు. వివిధ విదేశీ కంపెనీలకు చెందిన లీటర్ పరిణామం గల 25 మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ నిమిత్తం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు - 1 కార్యాలయంలో అప్పగించారు. నాగరాజుతో పాటు చెన్నైకు చెందిన ప్రభు, మాణిక్యం, ట్రాన్స్‌పోర్టుకు చెందిన వారిపై ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ బాబు కేసు నమోదు చేశారు. నిందితుడు నాగరాజును అరెస్ట్ చేశారు. మిగిలిన వారిని త్వరలోనే అరెస్ట్ చేస్తామని ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.



నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ సిబ్బంది

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ప్రేమ విఫలమై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నెల్లూరులోని ఎన్టీఆర్ నగర్‌లో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఎన్టీఆర్ నగర్ యాదవ వీధిలో పాల వ్యాపారి మల్లయ్య నివాసముంటున్నాడు. అతడి వద్ద బిహార్ రాష్ట్రానికి చెందిన సంజయ్ యాదవ్ కొంతకాలంగా పనిచేస్తూ అక్కడ ఇంట్లోనే ఉంటున్నాడు. సంజయ్ యాదవ్ బావమరిది రాకేష్ కుమార్ యాదవ్ (21) గతేడాది డిసెంబర్ 28వ తేదీన నెల్లూరుకు వచ్చాడు. బావతో కలిసి పాల వ్యాపారి వద్ద పనిలో చేరాడు. రాకేష్ కుమార్ తన స్వగ్రామంలో ఓ యువతిని ప్రేమించాడు. కొంతకాలం క్రితం వారి మధ్య విభేదాలు చోటుచేసుకోవడంతో యువతి అతడిని దూరం పెట్టింది. దీంతో రాజేష్ కుమార్ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. తరచూ బావ సంజయ్ యాదవ్‌కు చెప్పి బాధపడుతుండేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం తాను ఉంటున్న గదిలో ఫ్యాన్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన సంజయ్ యాదవ్ తన యజమానితో కలిసి బాలాజీ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు, ఎస్సై విజయ శ్రీనివాసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు నమోదు చేశారు.

భోగి మంటలు చూస్తూ..

- మిద్దె పైనుంచి పడి వృద్ధురాలి మృతి

నెల్లూరు(క్రైమ్): మిద్దె పైనుంచి భోగి మంటలు చూస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి ఓ వృద్ధురాలు మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు బాలాజీ నగర్ చెప్పుల ఫ్యాక్టరీ ప్రాంతానికి చెందిన రామిరెడ్డి, రత్నమ్మ (78)లు దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. భోగి సందర్భంగా సోమవారం స్థానికులు, కుటుంబ సభ్యులు మంటలు వేశారు. రత్నమ్మ మిద్దె (మూడో అంతస్తు) పైనుంచి చూస్తూ ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి మృతిచెందారు. బాధిత కుటుంబసభ్యులు బాలాజీ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై విజయ్ శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కండలేరులో 56.216 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 56.216 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 900, లోలెవల్ కాలువకు 10, హై లెవల్ కాలువకు 110, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

పేకాట స్థావరాలపై దాడులు

పొదలకూరు: మండలంలోని ఆల్తుర్తి గ్రామ సమీపంలో సోమవారం పేకాట స్థావరంపై ఎస్సై ఎస్‌కే హనీఫ్ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.30,050ల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా పేకాట ఆడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

- **వెంకటాచలం:** మండలంలోని ఇడిమేపల్లి పంచాయతీ పలుకూరువారిపాళెంలో పేకాట స్థావరాలపై పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని రూ.6,900ల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 120
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 218
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 240
లేయర్ చికెన్	: 145

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.39

సన్నవి : రూ.29

పండ్లు : రూ.18



రక్తమోడిన రహదారులు

జిల్లాలోని వెంకటాచలం మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకు మృతిచెందారు. గుడ్లూరు మండలంలో మోటార్‌బైక్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఓ వృద్ధుడు, బాలిక చనిపోయారు.

- రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

వెంకటాచలం/గుడ్లూరు: రెండు మోటార్‌బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని తండ్రీకొడుకు మృతిచెందగా, ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. ఈ విషాదకర ఘటన మండల కేంద్రమైన వెంకటాచలంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఇందుకూరుపేట మండలం లేబూరు గ్రామానికి చెందిన షేక్ కాలేషా (45) బేల్దారి పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సోమవారం ఉదయం లేబూరు నుంచి తన భార్య యాస్మిన్, 6వ తరగతి చదువుతున్న కుమారుడు అబ్దుల్ హమీద్ (12)తో కలిసి బైక్‌పై సైదాపురం మండలం గిద్దలూరు గ్రామానికి బయలుదేరారు. వెంకటాచలంలోని కసుమూరు రోడ్డు దాటిన తర్వాత ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొంది. దీంతో కాలేషా, యాస్మిన్, అబ్దుల్ హమీద్, మరో బైక్ నడుపుతున్న పాలిచెర్లపాడు గ్రామానికి చెందిన తాటిపర్తి చంద్రశేఖర్‌కు గాయపడ్డారు. వారిని వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం వెంకటాచలంలోని క్లస్టర్ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కాలేషా, అబ్దుల్ హమీద్ మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. యాస్మిన్, చంద్రశేఖర్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాలను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేశారు.



కాలేషా మృతదేహం



అబ్దుల్ హమీద్ మృతదేహం

బైక్‌ను కారు ఢీకొనడంతో..

మోటార్‌బైక్‌ను కారు ఢీకొని ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటన గుడ్లూరు మండల పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారిపై చేవూరు వద్ద సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గుడ్లూరు మండలం రావూరు గ్రామానికి చెందిన సరస్వతి వెంకటేశ్వర్లు (60) సోమవారం ఉదయం బైక్‌పై కావలికి వెళ్లి ఎరువులు తీసుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లా కొత్తపల్లి మండలం భీమవరం గ్రామానికి చెందిన మంతెన రాజ్‌కుమార్ కుటుంబం తమిళనాడులోని తిరువలికి కారులో వెళ్లి ప్రార్థనలు చేసుకుని తిరిగి సొంతూరికి బయలుదేరారు. ఈ క్రమంలో చేవూరు కారు లారీని ఓవర్‌టేక్ చేసి వెంకటేశ్వర్లు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి పైకి లేచి కింద పడింది. రాజ్‌కుమార్ డ్రైవింగ్ చేస్తుండగా ఆయన కుమార్తె అద్వైక రాజ్ (4) ముందు సీటులో కూర్చొని ఉంది. ఆ బాలిక తీవ్రంగా గాయపడింది. స్థానికులు గుర్తించి 108 అంబులెన్స్‌లో కావలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని కందుకూరులోని ఏరియా వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గుడ్లూరు ఎస్సై వెంకట్రావు తెలిపారు.



వెంకటేశ్వర్లు మృతదేహం



ఘటనా స్థలంలో కారు



చికిత్స పొందుతూ మృతిచెందిన బాలిక

అందని జీతాలు.. కార్మికుల ఇబ్బందులు

బుచ్చిరెడ్డిపాళెం: కూటమి ప్రభుత్వం మాటలకు క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతనే లేదు. ఉద్యోగులకు జీతాల విషయంలో పైకి ఒకటి చెబుతోంది. అయితే చాలామందికి సకాలంలో వేతనాలు అందడం లేదు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలో పనిచేస్తున్న 110 మంది పారిశుద్ధ్య కార్మికులకు కొన్నినెలలుగా జీతాల్లేవు. దీంతో సంక్రాంతి పండగ సమయంలో వారు తీవ్ర ఇబ్బందులు పడుతూ కాలం వెళ్లదీస్తున్నారు. 68 మంది శాశ్వత ప్రాతిపదికన పనిచేస్తుండగా, 42 మంది పంపు ఆపరేటర్లుగా, ఇంకా పారిశుద్ధ్య కార్మికులుగా తాత్కాలిక పద్ధతిలో విధుల్లో ఉన్నారు. 68 మందికి రెండు నెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న 42 మంది కార్మికులకు నాలుగు నెలల నుంచి వేతనాల ఊసే లేదు.

ప్రభుత్వ ఆధీనంలోని నగర పంచాయతీ సిబ్బందికి పండగ సమయంలో జీతాలను ఇవ్వకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సంక్రాంతిని జరుపుకొనేందుకు కొందరు కార్మికులు అప్పులు చేయాల్సిన పరిస్థితులు వచ్చాయి.

> **బిల్లులు పంపాం**
>
> జీతాలకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వానికి సమర్పించాం. రెండు రోజుల్లో జీతాలు పడే అవకాశం ఉంది.
>
> – చంద్రశేఖర్‌రెడ్డి, కమిషనర్